క్లుప్తంగా

హమాలీలకు కూలి పెంపు అమలు చేయాలి

లక్ష్మీపురం: సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ స్టాక్ పాయింట్లలో పనిచేసే హమాలీల కూలి రేట్ల పెంపును వెంటనే అమలు చేయాలని సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర నాయకులు గురువారం రాష్ట్ర సచివాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని, కమిషనర్ సౌరబ్ గౌర్, ఎం.డీ మనజీర్ సులేమాన్ జిలానీని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చల్లా చిన్న ఆంజనేయులు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఆంధ్రాకు 53 పతకాలు



లక్ష్మీపురం: జాతీయ ఆరో మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఆంధ్రరాష్ట్రానికి 53 పతకాలు దక్కడం అభినందనీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. స్థానిక శ్రీనివాసరావుపేటలోని ఆమె కార్యాలయంలో గురువారం మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర అధ్యక్షుడు లాల్‌వజీర్‌ను ఎమ్మెల్యే మాధవి అభినందించారు. మెడల్స్ దక్కించుకున్న మాస్టర్స్ క్రీడాకారులను ప్రశంసించారు. లాల్‌వజీర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3 తేదీలలో కేరళలో జరిగిన ఆరో జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఆంధ్ర రాష్ట్ర క్రీడాకారులు ఐదో స్థానం కైవసం చేసుకున్నారన్నారు. అలాగే 11 బంగారు, 18 వెండి, 24 బ్రాంచ్ మెడల్స్‌ను సాధించారని వివరించారు. రాష్ట్రం నుంచి మొత్తం 105 మంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని చెప్పారు.

ఉత్తమ ఆర్కిటెక్ట్ అవార్డు గ్రహీతకు సత్కారం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక కొత్తపేట కె.ఆర్.ప్లానర్స్ కార్యాలయ ఆవరణలో గురువారం సివిల్ ఇంజినీర్ అబ్దుల్‌రహీంను సత్కరించారు. ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని ఓ హోటల్‌లో బెస్ట్ బిల్ట్ హౌస్ కేటగిరిలో జిల్లాకు చెందిన నలుగురు ఇంజినీర్లకు ఉత్తమ ఆర్కిటెక్ట్ అవార్డులను ఐసీఐ విజయవాడ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వెంగళ జగదీష్ అందించారు. ఈ అవార్డు స్వీకరించిన అబ్దుల్‌రహీంను సత్కరించగా, అవార్డు లభించడంపై పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ షేక్.అన్వర్, హఫీజుల్లఖాన్, సయ్యద్‌అలీం, మస్తాన్, అబ్దుల్‌సత్తార్, ఫిరోజ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో విద్యార్థి హల్‌చల్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఓ విద్యార్థి ఫుల్లుగా మద్యం సేవించి ఓ వ్యక్తిపై దాడిచేసిన సంఘటనపై తాడేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. స్థానికంగా వున్న ఓ యూనివర్సిటీలో విజయవాడ, గాంధీనగర్‌కు చెందిన ఓ విద్యార్థి బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అతను పూటుగా మద్యం సేవించి రోడ్డుపై ఒక మహిళతో గొడవ పడుతుండగా వద్దని చెప్పిన వెంకటేశ్వరరావు అనేవ్యక్తిపై దాడి చేసి గాయపరచడంతో వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ విద్యార్థిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేతులు శుభ్రత తప్పక పాటించాలి



ఫిరంగిపురం: ప్రతిఒక్కరూ భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుగుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని వైద్యురాలు శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం–1 పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 20 మంది గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. 30 మందికి బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలు చేశారు. 82 మందికి సాధారణ వైద్యపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా వారికి చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, ఎనీమియా రాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు గురించి వివరించారు. సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ అమృత, ఏఎన్‌ఎంలు సుశీల, లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మామూలిస్తే ఎస్..సీ..!

- వార్డెన్ల నుంచి నెలవారీగా డబ్బు గుంజుతున్న అధికారులు
- బిల్లులు ప్రాసెస్ చేయాలంటే పెద్ద మొత్తంలో ముట్టజెప్పాల్సిందే
- పీఆర్సీ, పే స్కేల్స్ వేయాలన్నా ఉన్నతాధికారుల కటాక్షం తప్పనిసరి
- అధికారులకు బినామీలుగా కథ నడిపిస్తున్న డ్రైవర్లు, గుమస్తాలు
- తప్పు చేసినా భారీగా ముట్టజెబితే అన్నీ అనుకూల ఆదేశాలే

ఎస్సీ వెల్ఫేర్‌లో జోరుగా వసూళ్ల పర్వం



ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయం

నెహ్రూనగర్: ఎస్సీ వెల్ఫేర్‌లో మామూళ్ల పర్వం నడుస్తోంది. ఏ పనైనా ముడుపులు ఇస్తేనే పూర్తవుతుంది. ఏ తప్పు చేసినా ప్రతి దానికి ఒక రేటు అని ఫిక్స్ చేస్తే ఆ తప్పులు కూడా మాఫీ చేస్తారు వెల్ఫేర్ అధికారులు. తమను ప్రసన్నం చేసుకున్న వారికి కలెక్టర్లు ఇచ్చిన రిపోర్టులను కూడా మాయం చేయగల సమర్థులు సంబంధిత కార్యాలయంలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు మామూళ్ల పర్వంపై నోరు మెదపడం లేదంటే వారిని కూడా ఎంతలా మ్యానేజ్ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు శూన్యం..

గతంలో గుంటూరు నగరంలో బాలికల హాస్టల్స్‌లో పలుమార్లు బాలికలను కొంత మంది ఆకతాయిలు బయటకు తీసుకువెళ్లిన సందర్భాల్లో వార్డెన్లపై తూతూమంత్రంగా చర్యలు తీసుకున్నారు.

కేసులు పెండింగ్‌లో ఉన్నా ప్రమోషన్లు

సర్వీస్ మేటర్స్‌పై కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ముడుపులు సమర్పించుకుంటే సీనియర్సను కాదని జూనియర్స్ కూడా ప్రమోషన్లు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు 7 కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి రిప్లై ఇవ్వాలని కోర్టులు అధికారులను ఆదేశించినప్పటికీ స్పందించడం లేదు. రూ.3 లక్షలు తీసుకుని గత కొద్ది నెలల క్రితం క్లాస్ 4 నుంచి వార్డెన్స్‌గా, వార్డెన్స్ నుంచి ఏఎస్‌డబ్ల్యూఓలుగా ప్రమోషన్లు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

తొమ్మిదేళ్లుగా రెండు హాస్టళ్లకు ఒక్కరే..

గుంటూరు జిల్లాలో 34 ఎస్సీ సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. పెదనందిపాడు ఎస్సీ బాలుర హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్‌గా పనిచేస్తూనే 9 సంవత్సరాలపైబడి గుంటూరులోని ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు ఇన్‌చార్జ్ వార్డెన్‌గా ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. పెదనందిపాడులో కొద్ది నెలల క్రితం ఓ విద్యార్థిని హాస్టల్‌లో పనిచేసే ఓ చిరుద్యోగి కొట్టడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చిరుద్యోగిని విధుల నుంచి తప్పించారు. వార్డెన్‌పై చర్యలు లేవు.

అడిగినంత ఇస్తేనే బిల్లులు ప్రాసెస్

ప్రతి నెల విద్యార్థులకు ఇచ్చే డైట్ చార్జీల బిల్లులు ప్రాసెస్ చేయాలంటే అధికారులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. తమ అనుకునే వారికి బిల్లులు సక్రమంగా లేకపోయినప్పటికీ మంజూరు చేస్తున్నారని సిబ్బందే చెబుతున్నారు. పీఆర్సీ రివిజన్, ఇంక్రిమెంట్లు కలపాలన్నా అధికారులను ప్రసన్నం చేసుకుంటేనే పని పూర్తవుతుంది. సాంఘిక సంక్షేమ శాఖలో అధికారుల వద్ద పనిచేసే డ్రైవర్లు, గుమస్తాలే హాస్టల్ వార్డెన్ల నుంచి నెలవారీ మామూళ్లు చేసి అధికారులు ఇస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి.

కాఫీ మితంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే

గుంటూరు మెడికల్: కాఫీని మితంగా తీసుకుంటే మంచిదేనని సీనియర్ కార్డియాలజిస్ట్, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పర్వతనేని నాగశ్రీ హరిత అన్నారు. గురువారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాఫీ తాగడం శరీరానికి మంచిదా? కాదా ?అనేది చాలా మందిలో ఉన్న సందేహం ఉందన్నారు. కాఫీ విషయంలో ఇంతకముందు కంటే ఇప్పుడు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. మహిళల్లో కాఫీ తాగడం వల్ల అల్జీమర్స్, గుండె సంబంధిత సమస్యలు రావడం కొంత మేరకు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనికి కారణం కాఫీలో కెఫీన్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, క్రియాశీల పదార్థాలు ఉండటమేనని వెల్లడించారు. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లామేషన్ తగ్గించి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని చెప్పారు. రోజు ఒక నిర్దిష్ట సమయంలో కాఫీ తాగేవారిలో బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదం తగ్గుతుందని ఇటీవల పరిశోధనలో వెల్లడైందన్నారు. అయితే కాఫీ ఎప్పుడంటే అప్పుడు ఎక్కువగా తీసుకోవడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుందన్నారు. అధిక రక్తపోటు, షుగర్, అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు కాఫీ తాగకపోవడం మంచిదన్నారు.

ఢిల్లీ ఎన్నికలపై సదస్సు



లక్ష్మీపురం: ఢిల్లీ వాసులను రాజకీయ పార్టీలు వరాల జల్లులో తడిపేశాయని అవగాహన సంస్థ సభ్యుడు, విద్యావేత్త ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'ముగిసిన ఢిల్లీ ఎన్నికలు–గుణ పాఠాలు' అన్న అంశంపై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కంటే ప్రచార కాలుష్యం ఎక్కువ హాని చేస్తుందని మేధావులు ఆవేదన చెందుతున్నారన్నారు. విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ దిగువ శ్రేణి జనం ఆప్ పార్టీకి, ఆదాయపు నిచ్చెనలో పైకి పోయిన కొద్దీ అవకాశాలను అందుకుంటున్న ప్రజానీకం మాత్రం మోడీ, బీజేపీ వైపు మొగ్గు చూపుతారనేది ఓ విశ్లేషణగా ఉందని అభిప్రాయపడ్డారు. చర్చలో విశ్లేషకులు ఎస్.సదాశివం, విశ్రాంత అధికారి వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు, అచ్యుత ఇందు శేఖర్ ప్రసంగించారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను తక్షణం అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్. బాబురావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామారావు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. బాబూరావు మాట్లాడుతూ కూటమి పార్టీల నేతలు ఎన్నికల ముందు ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 8నెలలైనా ఇప్పటికీ హామీలు అమలుకు పూనుకోలేదని విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తే ఆర్థిక భారం ప్రజలపై మోపాల్సి వస్తుందని సీఎం పేర్కొనడం సరికాదన్నారు. ఉద్యోగులకు ఇస్తామన్న పీఆర్సీ ఏదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ నాయకులు ఎ.భావన్నారాయణ, ఇ.అప్పారావు, ఎం.రవి, కె.నళినీకాంత్, బూరగ వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసకుమారి, జవహర్‌లాల్, దుర్గారావు, డి.లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు, కె.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

రోటరీ ఇంటర్నేషనల్ నిరంతర సేవలు



నగరంపాలెం: రోటరీ క్లబ్స్ ఇంటర్నేషనల్ నిరంతరం సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నాయని 3105 మాజీ గవర్నర్ అన్నే ప్రభాకర్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో 'రోటరీ వొకేషనల్ ఎక్ అవార్డ్స్ 2024–25 నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటుడు జీవ (కొచ్చర్ల దయారత్నం), డాక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు, చార్టెడ్ అకౌంటెంట్ పి.వి.మల్లికార్జునరావు, పారిశ్రామికవేత్త దేసు సూర్యప్రకాశరావు, సోషల్ మీడియాకు సంబంధించి ఏలూరి నందినిలను సత్కరించారు. క్లబ్ అధ్యక్షులు గాలి సుబ్బారావు అధ్యక్షతన వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఫాస్ట్ జిల్లా గవర్నర్ వడ్లమాని రవి, సహాయ గవర్నర్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, కార్యదర్శి డాక్టర్ పాందూరి శివప్రసాద్, కోశాధికారి టి.వి.సీతారామయ్య, ఒకేషనల్ అవార్డు డైరెక్టర్ వెలనాటి కోటేశ్వరరావు, ముప్పాళ్ళ సుబ్బారావు, సీతా రమేష్, శ్రీధర్‌బాబు, ఎల్‌ఐసి ప్రసాద్, పీవీ.సత్యనారాయణ, యశ్వంత్ పాల్గొన్నారు.


భవిష్యత్తు గ్రీన్ హైడ్రోజన్‌దే



ముఖ్య అతిథులను సత్కరించిన మురళీమోహన్, ఎస్‌ఆర్కే ప్రసాద్, గోపీచంద్, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంధన రంగంలో భవిష్యత్తు గ్రీన్ హైడ్రోజన్‌దేనని హాంకాంగ్ పాలిటెక్నిక్ యూనివర్శిటీ ప్రతినిధి డాక్టర్ బి. గోరవర్ధన్‌బాబు పేర్కొన్నారు. జేకేసీ నగర్‌లోని జేకేసీ కళాశాలలో గురువారం రసాయనశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో ''స్థిరమైన అభివృద్ధి కోసం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి–వినియోగం ''పై గురువారం అంతర్జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవర్ధన్ బాబు మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై తాను చేసిన పరిశోధనలను విశ్లేషణాత్మకంగా వివరించారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ ప్రతినిధి డాక్టర్ బి.జయదేవ్ కౌశిక్ మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు చేసిన పరిశోధకులకు వివరించారు. పర్యావరణానికి హాని కలిగించని ఇంధన వనరులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వెల్లడించారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బొగ్గు, డీజిల్, భారీ ఇంధన చమురుతో పోలిస్తే గ్రీన్ హైడ్రోజన్ క్లీన్ ఎనర్జీగా ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు, పరిశోధకులకు మౌఖిక, పోస్టర్ ప్రదర్శన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వర్క్‌షాప్‌లో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్‌ఆర్కే ప్రసాద్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఎం. గౌరీశంకర్, డాక్టర్ ఎన్. మాధవి, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ వర్శిటీ విశ్రాంత వీసీ డాక్టర్ వి. గోవర్ధనరావు, జోషిల్ సంస్థ కెమిస్టులు పి.వెంకటేశ్వర్లు, డి.వాసుబాబు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వీల్‌చైర్స్ వితరణ



గుంటూరు మెడికల్: రామ చంద్ర చిల్డ్రన్ – డెంటల్ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి.చంద్ర శేఖర్ రెడ్డి, డాక్టర్ సరస్వతి దంపతులు గుంటూరు జీజీహెచ్‌కు పది వీల్ చైర్స్‌ని వితరణగా అందించారు. డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాతృ మూర్తి పేరుతో నడుపుతున్న స్వచ్ఛంద సంస్థ 'అన్నపూర్ణా చారిటబుల్ ట్రస్ట్' ద్వారా జీజీహెచ్‌కు వీల్‌చైర్స్‌ను గురువారం వితరణ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు మాతృ సంస్థకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. వీల్ చైర్స్ ఇచ్చిన డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డిని ప్రశంసించారు.

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు అవసరం

యువజన సర్వీసులశాఖ సీఈవో చంద్రముని రంగల్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని కలిగి ఉండాలని యువజన సర్వీసులశాఖ సీఈవో చంద్రముని రంగల్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రముని రంగల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యం ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అటువంటి వారే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు డాక్టర్ ఏ.వీర రాఘవరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనా విధానాలు గొప్పగా ఉన్నప్పుడే వాటి ప్రభావంతో ఆచరణ సాధ్యమై, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోగలరని అన్నారు. వాణిజ్య రంగంలో కృత్రిమ మేధ కీలకం కానుందని, విద్యార్థులు ఏఐపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా వ్యాపార, వాణిజ్య రంగాల్లో కృత్రిమ మేధ, డేటా సైన్స్ ప్రభావం కీలంగా మారనుందని తెలిపారు. యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి. రాధిక మాట్లాడుతూ విద్యార్థులకు దిశా నిర్దేశనం చేయడం ద్వారా సరైన మార్గంలో పయనించడంతో పాటు భవిష్యత్తులో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలరని అన్నారు. సదస్సులో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ తస్నీరు శ్రీనివాసరావు, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి జి. సురేష్, పీజీ వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, అధ్యాపకులు, పి శ్రీలత, ఎస్ వరలక్ష్మి, ఎన్. సంగీత, వైసీహెచ్ మణికంఠ, సయ్యద్ షెహనాజ్, ఆర్. జయశైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామ, షిర్డీసాయి మందిర బ్రహ్మోత్సవాలు



సీతారామ లక్ష్మణులు, షిర్డీసాయిబాబా ఉత్సవ మూర్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని సాకేతపురం 5వ లైనులో కొలువైన సీతారామ లక్ష్మణ సమేత ప్రసన్నాంజనేయస్వామివారి దేవస్థాన, షిర్డీ సాయి మందిర 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. మూడు రోజులుగా విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, తులసీ దళాలతో అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం ఉదయం సీతారాములకు తులసీ దళాలతో అర్చన, భక్తులతో 11 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించి, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సాయంత్రం గుర్రపు బండిపై స్వామివార్ల ఉత్సవమూర్తులను మేళ తాళాలు, కోలాటం నడుమ నగర వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చీమలదిన్నె పిచ్చయ్య, ఉపాధ్యక్షుడు బాపట్ల శ్రీనివాస్, కార్యదర్శి మువ్వా పద్మావతి, కోశాధికారి ఓలేటి కిషోర్ ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యువతిని కొట్టి బెదిరించిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: యువతిని కొట్టి, బూతులు తిట్టి బెదిరింపులకు దిగిన ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన అబ్బురీ స్వాతి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. ఏడేళ్ల క్రితం గుంటూరు రాజేంద్రనగర్ 1వ లైన్‌కు చెందిన శివసాయి కిరణ్ ట్విటర్‌లో పరిచయమయ్యాడు. ప్రేమగా మారడంతో ఇద్దరూ పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రాజధాని ప్రాంతంలో స్థలాలు కొనడం వల్ల లాభాలు వస్తాయని చెప్పడంతో స్వాతి సాయి కిరణ్‌కు, ఆయన తండ్రి ఖాతాలకు రూ.52 లక్షలు పంపింది. ఆ డబ్బుతో రాజధాని ప్రాంతంలో సాయి కిరణ స్థలాలు కొన్నాడు. అలాగే సాయికిరణ్‌కు పెళ్లికి ముందే కట్నం ముట్టజెప్పింది. వీరిద్దరికీ 2024 ఆగస్టులో నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల వీరిద్దరి పెళ్లి నిలిచిపోయింది. ఈ క్రమంలో సాయి కిరణ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. దీంతో స్వాతి కిరణ్ తండ్రి వద్దకు వెళ్లి నగదు వాపస్ చేయాలని కోరడంతో రూ.8 లక్షలు తిరిగిచ్చాడు. మిగిలిన నగదు ఇవ్వాలంటూ గురువారం స్వాతి సాయి కిరణ్ తండ్రి వద్దకు వచ్చి అడిగింది. దీంతో కోపోద్రిక్తుడైన కిరణ్ తండ్రి ఆమెను కొట్టి, బూతులు తిట్టి బెదిరించాడు. దీంతో బాధితురాలు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వేధించి ఆమె తండ్రిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు

లక్ష్మీపురం: స్కూల్‌లో స్టడీ అవర్స్ పూర్తి చేసుకున్న బాలిక తండ్రితో కలిసి ఇంటికి వెళుతున్న క్రమంలో ఇద్దరు యువకులు ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించారు. తండ్రి నిలదీయడంతో ఆయనపై బీరుబాటిల్‌తో దాడి చేశారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. పట్టాభిపురం పోలీసుల కథనం ప్రకారం.. విద్యానగర్ 1వ లైన్ ఆంజనేయ స్వామి గుడి ప్రాంతానికి చెందిన అల్లాడి శ్రీనివాసరావు కుమార్తె ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. గురువారం రాత్రి 8 గంటల సమయంలో స్టడీ అవర్స్ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో నాగసాయి, జానీ అనే ఇద్దరు యువకులు బాలికతో అసభ్యంగా ప్రవర్తించారు. వేధించారు. దీన్ని గమనించిన తండ్రి శ్రీనివాసరావు ఇద్దరు యువకులను నిలదీయడంతో వారి వద్ద ఉన్న బీరు బాటిల్‌తో శ్రీనివాసరావు తలపై దాడి చేశారు. స్థానికులు, శ్రీనివాసరావు భార్య కేకలు పెట్టడంతో నాగసాయి, జానీ అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల సహాయంతో శ్రీనివాసరావు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స అనంతరం గురువారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నాగసాయి, జానీపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి



ప్రతిభావంతులైన విద్యార్థులతో రత్నశీలామణి, సీతారామిరెడ్డి, రఘురాం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించినప్పుడే వారు ఉత్తమ పౌరులుగా ఎదిగి, సమాజాభివృద్ధికి తోడ్పడుతారని ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె.రత్నశీలామణి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని వేంకటేశ్వర బాలకుటీర్ 60వ వార్షికోత్సవాన్ని గురువారం సాయంత్రం వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్న శీలా మణి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి గురువులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేసినప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యువత ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ దుర్గా రఘురాం మాట్లాడుతూ విద్యార్థులు, యువతరం స్మార్ట్ గాడ్జెట్స్ ద్వారా పక్కదారి పడుతున్నారని, విద్యార్థులను వాటికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత పెద్దలదేనని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/13వ అడ్డరోడ్డు ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠపాలిత ఓంకార క్షేత్రం ఆవరణలో నిర్వహిస్తున్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం– 95వ సంఘ వార్షికోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఉదయం నగర సంకీర్తన, శ్రీహనుమత్ లక్ష్మణ సీత సమేత కోదండ రామస్వామి వార్లకు తులసి అర్చనలు నిర్వహించారు. శ్రీసీతారాముల వారి కల్యాణం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ చేపట్టారు. కల్యాణం, తలంబ్రాలు విశేష హారతి, మంత్రపుష్పం జరగ్గా అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. రుద్రాభట్ల సూర్యలక్ష్మీ బృందం పలు కీర్తనలను ఆలపించారు. శ్రీమద్ రామాయణ ప్రవచనం అరణ్యకాండలోని విశేషాలను మంచికంటి వెంకటసత్యవతి వివరించారు. శుక్రవారం పద్మావతి ఆండాల్ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు కార్యదర్శి నంబూరు వెంకటశ్రీమన్నారాయణమూర్తి తెలిపారు.

విజయ గణపతి విహారం

నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎస్‌కాలనీ పద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తున్న శ్రీవిజయ గణపతి స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరాయి. గురువారం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, నిత్య హోమం, గణపతి హోమం, తిరువంజన సేవ, మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం విజయ గణపతి స్వామి దివ్య రథోత్సవం ప్రధాన రహదారిలో కొనసాగింది. 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ రథోత్సవాన్ని ప్రారంభించారు. పాతగుంటూరు శ్రీలక్ష్మీ కోలాట భజన సమాజం వారు కోలాట ప్రదర్శన చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



పుర వీధుల్లో రథోత్సవం



శ్రీవిజయ గణపతి స్వామి వారు